# గౌతమీ గాథలు

### ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

'నిరుద్యోగం' నాటకం-
రిహార్సల్స్ జరుగుతున్నాయి.

హైస్కూల్ టీచర్సు కొందరు, ఔత్సాహికులు కొందరు కలిసి ఆంధ్ర నాటక కళా పరిషత్తు ప్రదర్శనాలలో వెయ్యదలచారు.

శంకరం హైస్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచరు. సరదా మనిషి. హీరో వేసే రఘురామ్ అతన్ని కూడా చిన్న పాత్ర వెయ్యమని బలవంతం చేశాడు.

శంకరానికి నాటకాల సరదా. చాలా చూశాడు. నాటకంమీద ఖచ్చితమైన కొన్ని అభిప్రాయాలున్నవాడు. కాని ఎప్పుడూ నటించాలనే కోరిక లేదు.

ఒక షరతుమీద వేసానన్నాడు.

స్త్రీలు స్త్రీపాత్రలు ధరించకూడదు.

నాటకం వాళ్ళంతా నవ్వారు. కూరలో ఉప్పుండకూడదు అన్నంత వెటకారంగా-

శంకరం అంటాడు-- "అబ్బాయిలూ! ఒకటుంది మగవాడు ఆడవేషం వేస్తే అది నాటకం. ఆడదే వేస్తే అది జీవితం. వృద్ధులు వృద్ధపాత్రలు, పిల్లలు పిల్లపాత్రలూ వేయమని కోరరు. ఎందుచేత?" రఘు కార్యవాది. వాదించి లాభంలేదనుకున్నాడు.

'ఆల్ రైట్- ఆడది నీ పక్కన నటించదు. నువ్వు వెయ్యి" శంకరం అన్నాడు. శంకరం ఒప్పుకున్నాడు.

నాటకంలో- శంకరం ఒక ఆఫీసరు దగ్గర కాంపు క్లార్కు, అతని భార్య సుగుణగా ఒక కుర్రాణ్ని సెలెక్టు చేశారు. చదువుతున్నారు.

ప్రదర్శనం దగ్గరకొచ్చింది.

ఆ రోజు ఫైనల్ రిహార్సల్-

శంకరం హుషారుగా రంగం మీద కొచ్చాడు.

అతడు ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేసరికి భార్య ఎదురుగా వచ్చి పలకరించాలి. శంకరం ఆఫీసు ఫైలు చంకలో పెట్టుకుని నాలు గడుగులు వేసి సైడ్ పీస్‌లోకి చూశాడు.

"ఏమిటండీ మీది మరీ చాదస్తం- ఇంత ఆలస్యమైతే నేనొక్కర్తనూ ఇంటి దగ్గర వుండలేను బాబూ- ఆ చేతిలోదేమిటి? కొత్తచీర కాదుగదా-అయ్యో రాత! అంత అదృష్టం కూడానా?"

సైడ్‌పీస్‌లో నుంచి ఒక పదహారేళ్ళ పిల్ల. సంసారపక్షంగా వుంది. కళ్ళుదీపాల్లా వెలుగుతున్నాయి. చిరునవ్వులో ఒయ్యారంగా డైలాగ్ చెప్పి ఓరగా కళ్ళెత్తి చూసింది.

శంకరం ఉలిక్కిపడి పోర్షన్ మరచిపోయాడు. ఏమిటీ నయవంచన! రఘూను చంపుదామన్నంత కోపం వచ్చింది. అతడు కనపడలేదు.

తర్వాత తేలింది. సుగుణ వేసే కుర్రాడికి చాలా జబ్బు చేసిందిట! పాపం హఠాత్తుగా- నాటకం ఆగిపోకుండా ఈ పిల్లని వెతికి వెతికి తెచ్చారుట!'

తను భీష్మించుకు కూర్చుంటే- అప్రతిష్ఠంతా తనమీద పడుతుంది. 'సరే కానివ్వండి.' మనస్సు బిగబట్టుకున్నాడు.

కాకినాడలో ఒక థియేటర్ పక్క లాడ్జి!

నాటకం జట్టు వచ్చి నాలుగ్గదులాక్రమించింది. హీరోయిన్ శారద, సుగుణ వేసే పంకజం, తమ్ముడూ ఒక గదిలో, పక్కగదిలో రఘు, శంకరం- తక్కిన జట్టంతా తక్కిన గదుల్లో ప్రదర్శనానికి కావలసిన హంగామా అంతా చేస్తున్నారు

ఆ రాత్రి నాటకం జరిగింది. అద్భుతంగా [illegible] కట్టించగన్నారు. ప్రేక్షకులు. పరిషత్తువా[illegible] 'నిరుద్యోగం' ప్రశంసిస్తూ పెద్ద పాత్రలకు రెండు వెండి కప్పులు,

## శంకరం పంకజం

చిన్నపాత్రలకు రెండు రజత పతకాలు బహూకరించారు. వేషమే వద్దన్న శంకరానికో రజత పతకం రావడం విశేషం. అంతా లాడ్జికొచ్చారు.

రఘు శంకరాన్ని అమాంతంగా కౌగిలించుకుని "అద్భుతంగా చేశావు, బ్రదర్" అని కుదిపేశాడు. శంకరం నవ్వి ఊరుకున్నాడు- 'మీ ఎత్తులు గుర్తించానయ్యా' అన్నట్టు.

నటులంతా ఎవరిదారిన వారు వెళ్ళారు.

మర్నాడు పరిషత్తు ప్రదర్శనాల్లో నృత్య నాటిక చూసి మరీ వెడదామని రఘు. శంకరం, పంకజం, ఆమె తమ్ముడూ ఆగిపోయారు.

నృత్యనాటిక రాత్రి 9 గంటలకు ముగిసింది. రఘు ఒక మిత్రుడితో కలిసివెళ్ళి మళ్ళీ వస్తానన్నాడు. పంకజం తమ్ముడు నిద్రపోతున్నాడు- శంకరం ఒక్కడూ గదికి వచ్చి బడలికగా కన్నుమూసుకు ఆలోచిస్తున్నాడు.

తలుపు చప్పుడు. తలెత్తి చూశాడు. "ఎవరు?"

"మీ భార్య సుగుణ లేక పంకజం" గలగల నవ్వింది. గాలికి ఊగిన మాలతి తీగనుంచి జలజల పువ్వులు రాలినట్టు- శంకరానికి మతిపోయింది. ఊహించని కొత్త నాటకం! నవ్వుతూ అన్నాడు. "నాటకాల్లో నా లాంటి భర్తలు ఎందరయారో. నీకు పంకజం" నిట్టూర్పు విడిచాడు.

"మీరు పొరబడ్డారు. మీ లాగే నాకూ ఇది తొలి నాటకం. ఒక మగవాడికి భార్యగా నటించడం ఇదే మొదలు-ముందు భయమేసింది. తర్వాత మీ అమాయకత్వం. నిజాయితీ చూసి కవ్వించి నటించాను. అది రక్తిగా సాగింది. మీ మీద ఏదో తెలియని ఇష్టం మొదలైంది. రేపు మీరెవరో నేనెవరో- ఒక్కసారి మిమ్మల్ని చూసిపోదామని సాహసించి వచ్చాను. ఒక గంటలో ప్రయాణం" తడి కళ్ళతో దగ్గరగా కూర్చుంది-ఆ ముఖంలో కపటం మారువేషం కనిపించలేదు.

శంకరం కదిలిపోయాడు-" పంకజం! బలవంతంగా నన్ను నాటకంలో ఇరికించారు. విధిలేక ఒప్పుకున్నాను. నా పోర్షన్ తగలేద్దామనుకున్నాను కాని, నువ్వు హఠాత్తుగా నాగస్వరం ఊదుతూ వచ్చి పడగ ముడుచుకు బుట్టలో పడుకున్న ఈ పామును పొడిచి ఆడించావు. నా మనసు పొరల్లో దాగివున్న స్త్రీమూర్తి నీలో కనపడింది. ఎన్నాళ్ళ నిద్రలోంచో ఈనాడు మేలుకున్నట్లయింది. నీవు ఎదురుగావుంటే కొండలు పిండి కొట్టగలను! రెక్కలు విప్పి ఎగరగలను!"

వెలిగే అతని కళ్ళు చూసి పంకజం నవ్వి "వదులెండి- ఈ రెండు సపోటా పళ్ళు తినండి- నా చేత్తో ఒలిచిపెడతాను." పళ్ళు ఒలిచి చేతిలో పెట్టబోతూంటే చేయి ఒణికింది పళ్ళు జారిపోకుండా శంకరం ఆమె నున్నని చేతులు పట్టుకున్నాడు.

"నేను అంటరానిదాన్ని- తాకవద్దనుకున్నాను. బురదలో పుట్టాను. విలవిలా

(56 వ పేజీ చూడండి)